

గాంధీజీకి నివాళులు

జిల్లాలో బుధవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీజీకి ఘన నివాళులు అర్పించారు.

- 11లో ▸



గెలుపు ఓటములు సహజం

మాచారెడ్డి మండలం సోమారంపేటలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ముగిశాయి.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం

39.3 /22.3

వాతావరణం

ఉదయం చల్లనిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

గాంధారి సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌పై వేటు

- డీహెచ్‌కు సరెండర్ చేసిన డీఎంహెచ్‌వో

కామారెడ్డి టౌన్: గాంధారి ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్‌ను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(డీహెచ్)కు జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్ బుధవారం సరెండర్ చేశారు. లింగనిర్ధారణ, శిశు విక్రయం ఆరోపణలపై పలుమార్లు పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు కావడం, విధులకు డుమ్మా కొట్టడం వంటి కారణాలతో సదరు వైద్యాధికారిపై చర్యలు తీసుకున్నారు.

జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీ లోగల సమన్విత ఆస్పత్రిలో ఐదు నెలల గర్భిణీకి లింగనిర్ధారణ చేసిన విషయమై గతనెల 22న మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా ఉద్గీర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. అక్కడి పోలీసులు 29న జిల్లాకేంద్రానికి వచ్చి, ఆస్పత్రి నిర్వాహకుడు, గాంధారి సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్‌ను అరెస్ట్ చేసి తీసుకువెళ్లారు. అలాగే ఈ ఏడాది జూలై 5న సమన్విత ఆస్పత్రిలో శిశువిక్రయం ఘటనలో పీసీపీఎన్‌డీటీ యాక్ట్ కింద కేసు నమోదయ్యింది. అలాగే విధులకు డుమ్మా కొడుతుండడంతో సదరు వైద్యుడికి పలుమార్లు మెమోలు ఇచ్చారు. ఈ కారణాలతో డాక్టర్ ప్రవీణ్‌ను డీహెచ్‌కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు ఎల్లారెడ్డి బల్దియా చైర్మన్ ఎన్నిక



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి బల్దియా చైర్మన్ ఎన్నికను గురువారం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు కౌన్సిలర్ల సమావేశం అనంతరం ప్రిసైడింగ్ ఆఫీసర్, ఆర్డీవో మన్నె ప్రభాకర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికను నిర్వహించనున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి 8 మంది, బీఆర్ఎస్‌కు నలుగురు కౌన్సిలర్లు ఉన్నారు. ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఈ ఎన్నిక ప్రక్రియలో పాల్గొనే అవకాశాలున్నట్లు సమాచారం. దీంతో మున్సిపల్ పదవి హస్తగతం కావడం లాంఛనమేనని తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ పద్మ శ్రీకాంత్‌కే బల్దియా పీఠం దక్కే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

'ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి'



కామారెడ్డి టౌన్: రియల్ ఎస్టేట్ సమావేశాలు నిర్వహిస్తున్న నాగిరెడ్డిపేట ఎంఈవోపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు డిమాండ్‌చేశారు. ఈ విషయమై బుధవారం డీఈవో రాజును కలిసి ఫిర్యాదు చేశారు. మంగళవారం బతుకమ్మ వేడుకల పేరుతో మహిళా టీచర్లను మండల విద్యావనరుల కేంద్రానికి ఆహ్వానించిన ఎంఈవో.. హైదరాబాద్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థతో సమావేశం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు పుల్గం రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ప్రతినిధులు రాజశేఖర్, సాయిలు, భాస్కర్ పాల్గొన్నారు.

ఇందూరు నృత్యకారిణుల ప్రతిభ



నిజామాబాద్ రూరల్: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని నటరాజ నృత్య నికేతన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన నాట్య ప్రదర్శనలో నిజామాబాద్ అంజలి సిస్టర్స్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థినులు ప్రతిభ చాటారు. జిల్లాకు చెందిన సుమారు 15 మంది నాట్య కళాకారిణులు హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభకనబరిచారు. 155 మంది కళాకారులు ఒకేసారి నృత్యాన్ని ప్రదర్శించగా, మాస్టర్ గీతాంజలి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన చిన్నారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రైస్ మెడల్ సాధించారు.


బల్దియాలో ఓటుపాట్లు!

బల్దియా ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడకముందే ఆశావహులు ప్రచారం మొదలుపెట్టేశారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. నీటి సమస్య పరిష్కారానికి బోరుబావులు తవ్విస్తున్నారు. ఇతర తాయిలాలూ ఇస్తున్నారు.





కామారెడ్డి పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ (40వ వార్డు)లో ఇంటింటికీ ఏర్పాటు చేసిన నేమ్‌ప్లేట్లు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: మున్సిపల్ ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉంది. కానీ ఎన్నికల బరిలోకి దిగేందుకు రెడీ అవుతున్న వారు, ఇప్పటికే కౌన్సిలర్లుగా కొనసాగుతున్న వారు అప్పుడే ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తాము పోటీ చేయాలనుకుంటున్న వార్డులో ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

ఆశావహుల ముందుచూపు

- తాయిలాలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు యత్నం
- ఇంటి ఓనర్ల పేరుతో పోటాపోటీగా బోర్డుల ఏర్పాటు
- నీటి సమస్య ఉన్నచోట కమ్యూనిటీ బోర్లు తవ్విస్తూ.. మోటార్లు బిగిస్తూ..
- సంఘాలను మచ్చిక చేసుకుంటున్న నేతలు

ట్యాంకర్లు, బోరుబావులు, మోటార్లు..

కామారెడ్డి అనగానే అందరికీ గుర్తుకువచ్చేది తాగు నీటి సమస్య. వేసవి కాలంలో బోర్లన్నీ ఎత్తిపోయి నీటి సమస్య తీవ్రరూపం దాలుస్తుంది. న్యూ సిటీ అంతటా నీళ్ల సమస్య ఈసారి మరింతగా ఇబ్బంది పెట్టింది. ఈ నేపథ్యంలో ఆయా కాలనీల్లో చాలావరకు ఇళ్లలో బోర్లు ఎత్తిపోవడంతో వెయ్యి అడుగులకుపైగా లోతు బోర్లు తవ్వించేందుకు ఇళ్ల యజమానులు కమ్యూనిటీ బోర్ల తవ్వకానికి ఆసక్తి చూపారు. ఒక్కో వీధిలో కనీసం 20 నుంచి 25 మంది వరకు కలిసి కమ్యూనిటీ బోర్ల తవ్వకానికి రెడీ అయ్యారు. ఈ విషయం తెలియడంతో కొందరు సిట్టింగ్ కౌన్సిలర్లు మున్సిపల్ నుంచి బోర్లు వేయించడానికి ఏర్పాట్లు చేశారు. మరికొందరు బోరు తవ్వించుకుంటే మోటార్ ఇప్పిస్తామని ముందుకువచ్చారు. ముఖ్యంగా అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు, నాయకులు పలు వార్డుల్లో కమ్యూనిటీ బోర్లు వేయడానికి తమ వంతు సహకారం అందించారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్లు, నాయకులు కూడా అక్కడక్కడా కమ్యూనిటీ బోర్ల తవ్వకానికి సాయం అందించారు. ఈ వేసవి సీజన్‌లో కామారెడ్డి పట్టణంలో యాభైకి పైగా కమ్యూనిటీ బోర్లు తవ్వించినట్లు తెలుస్తోంది. అధికార పార్టీ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో బోర్ల తవ్వకాలు ఎక్కువగా జరిగాయి.

అలాగే తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీరందించేందుకు ప్రయత్నించారు. సిట్టింగ్ కౌన్సిలర్లు బల్దియాలో పరపతిని ఉపయోగించి ట్యాంకర్లను తమ వార్డుల్లో తింపి నీటిని సరఫరా చేశారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని ఉబలాటపడుతున్న కొందరు సొంత డబ్బులతో ట్యాంకర్లను ఏర్పాటు చేసి తమ వారు అనుకున్న ఇళ్లకు నీటిని సప్లై చేసి ఆదుకున్నారు. ఇవన్నీ 'ఓటు'పాట్లేనని పట్టణ ప్రజలు భావిస్తున్నారు.


సిండికేట్‌లకు ఫర్నిచర్..

కొన్ని వార్డుల్లో ఇరవై, ముప్పై కుటుంబాలు కలిసి సిండికేట్‌గా ఏర్పడితే వారికి కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు ఫర్నిచర్ సమకూరుస్తున్నారు. పండుగలు, ఫంక్షన్ల సమయంలో వాడుకునేందుకు కుర్చీలు, టేబుళ్లు ఇతర సామగ్రి ఇస్తున్నారు. చాలా కాలనీలలో గల్లీ సంఘాలు, సిండికేట్లు, కమ్యూనిటీ బోర్ కమిటీలు ఉన్నాయి. ఆయా కమిటీలను మచ్చిక చేసుకుంటే ఎన్నికల్లో తమకు మద్దతుగా నిలుస్తారన్న ఉద్దేశంతో వారికి కావలసిన ఫర్నిచర్ ఇస్తున్నారు. వినాయక చవితి, దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కావలసిన సౌకర్యాలూ కల్పించారు. విగ్రహాలు ఇప్పించడం, అన్నదానాలకు బియ్యం, సామగ్రి సమకూర్చడం చేశారు. వార్డుల్లో ఎవరైనా చనిపోతే గతంలో పిలిస్తే కూడా రాని వాళ్లంతా ఇప్పుడు పిలవకున్నా వాలుతున్నారు. అంత్యక్రియలు పూర్తయ్యేదాకా ఉండి అన్నీ చూసుకుంటున్నారు. అలాగే ఫంక్షన్లు, పెళ్లిళ్ల కోసం కూడా ముందుగానే వచ్చి నిలబడుతున్నారు.

ఇంటింటికీ నేమ్‌ప్లేట్లు..

జిల్లా కేంద్రంలోని 40 వార్డుతో పాటు పక్కనే ఉన్న 17వ వార్డులకు గతంలో ప్రాతినిధ్యం వహించిన ఓ మాజీ కౌన్సిలర్.. ఆ రెండు వార్డులపై దృష్టి సారించారు. రిజర్వేషన్ ఏ వార్డులో అనుకూలిస్తే ఆ వార్డు నుంచి పోటీ చేయడానికి రెడీ అయ్యారు. ఆ రెండు వార్డుల్లోని ఓటర్ల వివరాలన్నింటినీ సేకరించారు. ఇంటి యజమాని పేరు, ఇంటి నంబర్లతో నేమ్ ప్లేట్లు తయారు చేయించి, ఆయా ఇళ్లకు బిగింపజేశారు. అయితే 40వ వార్డు సిట్టింగ్ కౌన్సిలర్ ఆ బోర్డులను చూస్తూ ఊరుకోలేదు. తానూ నేమ్ ప్లేట్లు తయారు చేయించి వార్డులోని అన్ని ఇళ్లకు బిగింపజేశారు. దీంతో ఆ వార్డులో ప్రతి ఇంటికి రెండు నేమ్‌ప్లేట్లు కనబడుతున్నాయి. ఆ వీధు లగుండా వెళ్లేవారు ఒక్కో ఇంటికి రెండు నేమ్ ప్లేట్లను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రులు



బాన్సువాడ: శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించడానికి భక్తులు ఏర్పాట్లు చేశారు. ఆయా మండపాలలో గురువారం అమ్మవారు కొలువుదీరనున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమిస్తారు. 3న శ్రీ స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా, 4న శ్రీ బాలత్రిపురసుందరి దేవిగా, 5న శ్రీ గాయత్రి దేవిగా, 6న శ్రీ అన్నపూర్ణదేవిగా, 7న శ్రీ లలిత త్రిపుర సుందరి దేవిగా, 8న శ్రీ మహాలక్ష్మి దేవిగా, 9న సరస్వతి దేవిగా, 10న దుర్గాదేవిగా, 11న మహిషాసుర మర్ధినిగా, 12న రాజరాజేశ్వరి దేవిగా దర్శనమివ్వనున్నారు.

నేటి నుంచి 'ఫ్యామిలీ' సర్వే

నిజామాబాద్ అర్బన్: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం గురువారం నుంచి అధికారులు సర్వే చేపట్టనున్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద నియోజకవర్గానికి రెండు గ్రామాలను ఎంపిక చేశారు. ఇంటింటి పరిశీలన చేపట్టి ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పరిశీలించనున్నారు. ఈ నెల 8 నాటికి సర్వేను పూర్తి చేయనున్నారు. 9న పరిశీలన నిర్వహించి సర్వేకు సంబంధించిన అన్ని అంశాలతో సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపనున్నారు. ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లు నోడల్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నారు.

డిజిటల్ కార్డులు..

ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు రకరకాల గుర్తింపు కార్డులు ఉన్నాయి. వీటన్నింటిని కలిపి ఒకే డిజిటల్ కార్డు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో రేషన్‌కార్డు, పెన్షన్లు, సహాయక సంఘాలు, రైతు భరోసా, రైతు బీమా, ఆరోగ్యశ్రీ, కంటివెలుగు తదితర వివరాలను నమోదు చేయనున్నారు.



జిల్లాకేంద్రంలోని గంజి వర్తక సంఘంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మ సంబురం

జిల్లా కేంద్రంలో బుధవారం బతుకమ్మ సంబురాలు ప్రారంభమయ్యాయి. మహిళలు బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ ఆడారు. నిమజ్జనం అనంతరం వాయినాలు ఇచ్చుకున్నారు.

– కామారెడ్డి టౌన్

డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

- తొలిరోజు 133 మంది హాజరు
- అమావాస్య సెంటిమెంట్‌తో ఆసక్తి చూపని అభ్యర్థులు



డీఈవో కార్యాలయంలో అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

కామారెడ్డి టౌన్: డీఎస్సీ–2024 పోస్టులకు 1:3 పద్ధతితో ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన బుధవారం డీఈవో కార్యాలయంలో ప్రారంభమైంది. మొదటి రోజు 133 మంది ఎస్జీటీ అభ్యర్థులు మాత్రమే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. బుధవారం అమావాస్య కావడంతో అభ్యర్థులు పెద్దగా ఆసక్తి చూపలేదని తెలుస్తోంది.

జిల్లాలో 506 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నిర్వహించిన విషయం తెలిసిందే. 1:3 పద్ధతిన మొత్తం 1,518 మందితో మెరిట్ జాబితా రూపొందించారు. 5వ తేదీలోగా సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేయాల్సి ఉంది. ఆ తర్వాత మెరిట్, రోస్టర్, రిజర్వేషన్‌ల ప్రకారం టీచర్లుగా ఉద్యోగాలు సాధించిన వారి తుది జాబితాను ఏడో తేదీన ప్రదర్శించనున్నారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలి

డీఎస్సీ–2024కు సంబంధించి జిల్లాలో 1:3లో ఎంపికైన అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రావాలని డీఈవో రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన రెండు జిరాక్స్ సెట్లు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలను డీఈవో కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు ఫోన్‌లు, మెయిల్‌ల ద్వారా సమాచారం ఇచ్చామని, జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లోనూ జాబితా అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు వేళాయే!

- జిల్లాలో 3.14 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు
- 5.6 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని అంచనా
- నేటినుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కామారెడ్డి క్రైం: జిల్లాలో వానాకాలం సీజన్‌లో సాగు చేసిన వరి పంట చేతికొస్తోంది. బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, నిజాంసాగర్ తదితర మండలాల్లో ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఆయా ప్రాంతాల్లోని రైతులు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గురువారంనుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయి.

351 కేంద్రాల ద్వారా..

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 3.14 లక్షల ఎకరాల్లో వరి పంట సాగయ్యింది. వర్షాలు కురియడంతో పంటలు బాగున్నాయి. దీంతో మంచి దిగుబడులు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు 5.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రావచ్చని అంచనా వేసిన అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేశారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కామారెడ్డి జిల్లాలో 351 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 23 కేంద్రాలు, సహకార సంఘాల ఆధ్వర్యంలో 328 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. గురువారంనుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా.. మరో పది రోజుల తర్వాతే కొనుగోళ్లు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

లోటుపాట్లు లేకుండా..

ధాన్యం సేకరణలో ప్రతిసారి లోపాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధానంగా హమాలీల కొరత, సకాలంలో లారీలు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేలా చూసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. మొత్తం ప్రక్రియను పూర్తి చేయడానికి 1.45 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం ఉన్నాయి. వాటిలో ఇప్పటికే సగం వరకు సిద్ధంగా ఉంచామని అధికారులు తెలిపారు. సకాలంలో మిగతా వాటిని తెప్పిస్తామంటున్నారు.

సన్నాలకు ప్రత్యేక కేంద్రాలు..

రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించింది. ఇప్పుడు సేకరించే సన్న రకం వడ్ల ద్వారా సీఎంఆర్ ప్రక్రియ పూర్తి చేసి జనవరి నుంచి రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయాలనే యోచనలో ఉంది. ఇందుకోసం ఈసారి కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకం వడ్లను వేరువేరుగా సేకరించనున్నారు. రైతుల నుంచి సేకరించిన సన్న రకం ధాన్యానికి సంబంధించిన లోడింగ్, సీఎంఆర్ ప్రక్రియ, ఆన్‌లైన్ నమోదు ఇలా అన్నీ వేరుగానే చేపట్టనున్నట్లు తెలుస్తోంది. సన్న వడ్లను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యంత్ర పరికరాలను కేటాయిస్తూ మార్గదర్శకాలను సైతం విడుదల చేసింది.

ఇబ్బందులు లేకుండా చూస్తాం



జిల్లాలో 351 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నాం. కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు యంత్రాలు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్‌లు, ఇతర అన్ని వసతులు కల్పిస్తాం. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పూర్తి చేయిస్తూ ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చూస్తాం.

– రాజేందర్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్, కామారెడ్డి

చేతికొచ్చిన సోయా పంట

- జిల్లాలో జోరుగా నూర్పిళ్లు



జుక్కల్‌లో సోయా నూర్పిడి చేస్తున్న దృశ్యం

నిజాంసాగర్: వానాకాలం సీజన్‌లో సాగు చేసిన సోయా పంట చేతికొస్తోంది. దీంతో యంత్రాల ద్వారా జోరుగా పంట నూర్పిడి చేయిస్తున్నారు. జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో సోయా పంట సాగు చేశారు. ఎక్కువగా జుక్కల్, మద్నూర్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, పిట్లం, బాన్సువాడ, గాంధారి, సదాశివనగర్, తాడ్వాయి, లింగంపేట మండలాల్లో సాగయ్యింది. ప్రస్తుతం పంట కోతకు వచ్చింది. దీంతో రైతులు యంత్రాలతో నూర్పిడి చేయిస్తున్నారు. గతనెలలో కురిసిన భారీ వర్షాలతో చాలాచోట్ల పంట దెబ్బతింది. దీంతో దిగుబడులు తక్కువగా వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. నూర్పిడి చేసిన సోయాలను రైతులు ట్రాక్టర్ల ద్వారా మార్కెట్‌కు తరలిస్తున్నారు. ప్రభుత్వం త్వరగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరుతున్నారు.

నిజాంసాగర్ మూడు గేట్ల ఎత్తివేత



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం 8 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు మూడు వరద గేట్లను ఎత్తి 12 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ఆయకట్టు పంటల అవసరాల కోసం ప్రధాన కాలువకు 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగుల(17.8 టీఎంసీలు)తో కళకళలాడుతోంది.

ఎస్సారెస్పీ గేట్ల మూసివేత

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో బుధవారం మధ్యాహ్నం వరద గేట్లను మూసివేశారు. ప్రాజెక్ట్‌లోకి 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వరద కాలువ ద్వారా 12 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 2 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగుల కాగా బుధవారం సాయంత్రానికి అంతే నీటిమట్టంతో నిండుకుండలా ఉంది.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్‌కు ముగ్గురి ఎంపిక



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల జెడ్పీ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు పీడీ సతీష్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఇటీవల నిజామాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు వైష్ణవి, నందిని, మేనకలు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు ఆయన తెలిపారు. నారాయణపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వారు వెళ్లారన్నారు.

కొచ్చెరువు పరిశీలన



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ శివారులోని కొచ్చెరువును మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు బుధవారం పరిశీలించారు. బతుకమ్మ సంబురాలు ప్రారంభం కావడంతో దానికి సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా మున్సిపల్ కమిషనర్ కొచ్చెరువును పరిశీలించారు. బతుకమ్మ సంబరాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

డాక్టరేట్ అందుకున్న కృష్ణ



దోమకొండ : రాష్ట్ర గవర్నర్ బిష్ణుదేవ్ శర్మ చేతుల మీదుగా దోమకొండ మండల కేంద్రానికి చెందిన యువకుడు కంతం కృష్ణ డాక్టరేట్ పట్టాను అందుకున్నాడు. ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన 24వ స్నాతకోత్సవంలో భాగంగా పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను గవర్నర్ చేతుల మీదుగా మంగళవారం అందుకున్నట్లు కృష్ణ తెలిపారు. నిజామాబాద్ జిల్లా నవలలు, సామాజిక విశ్లేషణ అనే అంశం మీద అరుణకుమారి పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశానన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



కామారెడ్డి క్రైం : పట్టణంలోని కూలీ అడ్డా ప్రాంతంలో బుధవారం పట్టణ పోలీసులు ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోలీసులమని, బ్యాంకు అధికారులం అంటూ వచ్చే ఫోన్ కాల్‌సను నమ్మవద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురయితే వెంటనే 1930 కి గానీ, స్థానిక పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డిలో షీటీం బృందం పోలీసులు ప్రయాణికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరస్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు రెస్పాండ్ కావద్దని, ఓటీపీలు చెప్పవద్దన్నారు. బస్టాండ్‌లో దొంగల నుంచి చాకచక్యంగా ఉండాలని, బంగారు ఆభరణాలను ధరించి ప్రయాణించవద్దని సూచించారు.

ఘనంగా లియాఫీ ఆవిర్భావ దినోత్సవం

కామారెడ్డి అర్బన్ : భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ) 60వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లియాఫీ జెండాను ఎగుర వేసి, గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు మిఠాయిలు పంచి ఘనంగా నిర్వహించారు. ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోసం 1964 వ సంవత్సరంలో ఏర్పాటైన లియాఫీ 60 యేళ్లుగా ఎన్నో విజయాలు సాధించినట్టు లియాఫీ జాతీయ ప్లానింగ్‌కమిటీ వైస్ చైర్మన్ ఎల్.కిషోర్‌చంద్ అన్నారు.

బతుకమ్మ సంబురం షురూ..



మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జిల్లా కేంద్రంలో బతుకమ్మలతో మహిళలు



భిక్కనూరులో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మహిళలు

భిక్కనూరు : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బతుకమ్మ సంబురాలు ఘనంగా కొనాసగుతున్నాయి. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలు తయారుచేసి వీదుల్లో పెట్టి బతుకమ్మ ఆడారు. తదుపరి స్థానిక చెరువు కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తీరొక్క పూలను సేకరించి బతుకమ్మలను పేర్చి గ్రామ కూడళ్ల వద్ద బతుకమ్మ ఆడి నిమజ్జనం చేశారు.

ఘనంగా లాల్ బహదూర్ శాస్త్రి జయంతి



ఎండ్రియాల్‌లో లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



రాజంపేటలో మొక్క నాటుతున్న పోస్టల్ సిబ్బంది

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండలంలోని ఎండ్రియాల్‌లో బుధవారం గ్రామస్థులు లాల్ బహుదూర్ శాస్త్రి జయంతిని నిర్వహించారు. శాస్త్రీ చిత్రపటానికి పూళమాళలు వేసి నివాళలు అర్పించారు. పలువురు మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : లాల్ బహదూర్ శాస్త్రి జయంతి ని పురస్కరించుకుని బుధవారం రాజంపేట పోస్టల్ ఆఫీస్ ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్ట్ ఆఫీస్ ఆవరణలో ఎస్‌పీఎం భిక్షపతి, పోస్ట్‌మన్ రవిలు మొక్కను నాటారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు.

ముఖద్వార నిర్మాణానికి తీర్మానం



దోమకొండ : భిక్కనూరు మండలం బీటీఎస్ చౌరస్తా వద్ద దోమకొండ గడికోట గుర్తుతో ముఖ ద్వారా నిర్మాణానికి బుధవారం గ్రామ సభలో తీర్మానించారు. స్వాగత తోరణం నిర్మించాలని తీర్మానించినట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పంచాయతీ కార్మికులను సన్మానించి వారికి గుర్తింపు కార్డులను అందజేశారు. ఎంపీడీవో ప్రవీన్‌కుమార్, జీపీ కార్యదర్శి రమేష్, ఈజీఎస్ ఏపీవో రజనీ, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు తిర్మల్‌గౌడ్, ఏఎస్సై సుబ్రమణ్యాచారి ఉన్నారు.

వరద బాధితులకు చిన్నారుల చేయూత



ఎడపల్లి(బోధన్): మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో ఉన్న ఇమేజ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆర్థికసాయం అందజేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ హనుమంతుకు రూ.16,116 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ వేషధారణలో వచ్చిన చిన్నారులను కలెక్టర్ అభినందించారు. హెచ్‌ఎం శైలజ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కుమారుడు వెంటరాగా.. గుంతలు పూడ్చిన ఆటోవాలా

మాచారెడ్డి : రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు ప్రయాణికులకు అంతరాయం కలిగిస్తున్నాయని భావించిన ఓ ఆటోవాలా స్వచ్ఛందంగా బుధవారం గుంతలను పూడ్చి వేశాడు. ఆయన కుమారుడు చేయిందించడంతో పని పూర్తిచేశాడు. పాల్వంచ మండలం ఇసాయిపేట గ్రామానికి చెందిన దేవయ్య చుక్కాపూర్ లక్ష్మీ నృసింహాస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డుపై అనేక గుంతలు ఉండడంతో నిత్యం ఇబ్బందులు పడేవాడు. బుధవారం ఈ గుంతలను తన కుమారుడు రాకేశ్‌తో కలిసి పూడ్చివేశాడు. దేవయ్యను గ్రామస్తులు అభినందించారు.



రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను పూడ్చివేస్తున్న ఆటో డ్రైవర్, ఆయన కుమారుడు

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ఐదుగురి ఆత్మహత్య

రైలులో ఉరేసుకొని ..



ఖలీల్‌వాడి: బోధన్ రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న గుంతకల్ ప్యాసింజర్ రైలులో గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. బుధవారం నిజామాబాద్ రైల్వేస్టేషన్ మేనేజర్ నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఏళ్లు ఉంటుందని, ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులకు (87126 58591) నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..



ఎర్రం నవీన్ (ఫైల్)

నందిపేట్(ఆర్మూర్): ఆర్థిక ఇబ్బందుల కారణంగా మండల కేంద్రంలోని రాజానగర్ ప్రాంతానికి చెందిన ఎర్రం నవీన్(31) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బతుకు దెరువు కోసం గతంలో రెండు సార్లు దుబాయికి వెళ్లిన వచ్చిన ఎర్రం నవీన్.. మళ్లీ అక్కడికే వెళ్లేందుకు అప్పు చేసి ఏజెంట్‌కు డబ్బులు కట్టాడు. వీసా రాకపోవడంతో మనస్తాపం చెంది గతనెల 29వ తేదీన పురుగుల మందు తాగగా, కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం ఉదయం నవీన్ మృతి చెందాడు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

కాకతీయ కాలువలో దూకి ఒకరు..



జగదీశ్వర్(ఫైల్)

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామ శివారులో కాకతీయ కాలువలో దూకి గ్రామానికి చెందిన కర్తన్ జగదీశ్వర్(60) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రజినీకాంత్ , స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలో కిరాణాదుకాణం నడుపుతూ జగదీశ్వర్ కుటుంబంలో చిన్నచిన్న గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి కాకతీయ కాలువ వద్దకు వెళ్లాడు. చెప్పులు, కళ్ల జోడును కాలువ మెట్లపై పెట్టి కాలువలో దూకాడు. బుధవారం ఉదయం కాలువ వద్ద చెప్పులు, కళ్లజోడును గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలువ వెంబడి గాలింపు చర్యలు చేపట్టగా జగిత్యాల్ జిల్లా మెట్‌పల్లి శివారులోని కాలువలో మృత దేహం లభ్యమైంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆడుకోవద్దన్నందుకు..

ఖలీల్‌వాడి: ఆడుకునేందుకు బయటికి వెళ్లొద్దన్నందుకు ఓ బాలిక ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఖిల్లా ప్రాంతంలో బుధవారం చోటు చేసుకుంది. ఆడుకునేందుకు బయటికి వెళ్లొద్దని ఖిల్లారోడ్డు ప్రాంతానికి చెందిన 15 ఏళ్ల బాలికను తల్లి మూడు రోజుల క్రితం మందలించడంతో మనస్తాపానికి గురైన బాలిక అదే రోజు ఎలుకల మందు తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కాగా మంగళవారం రాత్రి మళ్లీ అస్వస్థతకు గురికావడంతో ఆమెను మళ్లీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాసిన్ అరాఫత్ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక మహిళ..



లలిత మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో పోలీస్ స్టేషన్ పరిధిలోని పద్మానగర్ రోడ్ నంబర్.1కు చెందిన కట్ట లలిత (53)అనే మహిళ కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

కడుపునొప్పితోపాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న లలిత మనస్తాపానికి గురై గత నెల 27న బాత్ రూమ్‌లో పురుగుల మందు సేవించిందని, కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. మృతురాలి సోదరుడు తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని వాజిద్‌నగర్ మంజీర వాగులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. నీటి ప్రవాహానికి మృతదేహం కొట్టుకువచ్చిందని, మృతుడి వయస్సు సుమారు 30 ఏళ్లు ఉంటుందని, కుడి చేయిపై ఇంగ్లిష్‌లో సోను అని, నల్ల ప్యాంటు ఉందన్నారు. ఎక్కడో నీటిలో మునిగి చనిపోయి ఉంటాడని, నీటి ప్రవాహానికి మృతదేహం కొట్టుకు వచ్చినట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మద్నూర్‌లో దొంగల హల్‌చల్

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో వరుస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధాన రోడ్డు వెంబడి తాళం వేసి ఉన్న ఇళ్లను దుండగులు టార్గెట్ చేస్తున్నారు. మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో ప్రధాన కూడలిలో తాళం వేసి ఉన్న ఇంట్లో మంగళవారం దుండగులు చోరీకి పాల్పడ్డారు. చోరీకి పాల్పడిన ఇంటి చుట్టూ ఉన్న ఇళ్లకు బయటి నుంచి దుండగులు గడియ పెట్టారు. బుధవారం ఉదయం ఇళ్లకు బయటి నుంచి గడియపెట్టి ఉండడంతో సన్నిహితులకు సమాచారం అందించారు. దుండగులు చోరీకి వచ్చి గడియపెట్టినట్లు గ్రహించారు. గత రెండు నెలల క్రితం ఇదే ఇంటికి వేసి ఉన్న తాళాన్ని పగలగొట్టిన దుండగులు బంగారం, వెండి వస్తువులతోపాటు నగదు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అప్పుడు జరిగిన చోరీ కేసులోనే దుండగులు ఇప్పటికీ పట్టుకోలేదని, మళ్లీ అదే ఇంట్లో చోరీకి వచ్చారన్నారు.

సీజ్ చేసిన గంజాయి దహనం



గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ సింధుశర్మ

కామారెడ్డి క్రైం: జిల్లాలో నమోదైన 15 కేసులకు సంబంధించి 137 కిలోల గంజాయితోపాటు ఐదు గంజాయి మొక్కలను నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం పడకల్ తండా ప్రాంతంలో ఎస్పీ సింధుశర్మ ఆధ్వర్యంలో బుధవారం దహనం చేశారు. కామారెడ్డి పట్టణంతోపాటు దేవునిపల్లి, రాజంపేట, గాంధారి, సదాశివనగర్, నస్రుల్లాబాద్, పెద్ద కొడప్‌గల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి పట్టుడగా దహనం చేసినట్లు ఏఎస్పీ నరసింహారెడి తెలిపారు. కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్ రావు, డీసీఆర్‌బీ డీఎస్పీ మదర్‌లాల్, సీఐలు తిరుపయ్య, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

మాక్లూర్ : మండలంలోని రెండు చోట్ల పేకాట స్థావరాలపై టాస్క్ ఫోర్స్ సీఐ పురుషోత్తం ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడులు చేశారు. ముందుగా అడవిమామిడిపల్లి శివారులోని పేకాటస్థావరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.52వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. గుత్ప శివారులో కొనసాగుతున్న మరో పేకాట స్థావరంపై దాడి చేసి రూ.4వేల నగదును స్వాధీనం చేసుకుని నలుగురి అదుపులోకి తీసుకున్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో కార్ లోన్ మేళా




ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్ల లోన్ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే కేవీఆర్

ప్రారంభించిన ఎమ్మెల్యే కాటిపల్లి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఎస్‌బీఐ ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణంలోని సీఎస్ఐ మైదానంలో ఏర్పాటు చేసిన కార్ మేళాను స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి బుధవారం ప్రారంభించారు. మేళాలో వివిధ కంపెనీలకు సంబంధించిన కార్లను ప్రదర్శించారు. కార్ల కొనుగోలుకు బ్యాంకు రుణాలను గురించి వివరించారు. ఎస్‌బీఐ కామారెడ్డి ప్రాంత రీజినల్ మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు కార్ల మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దసరా, దీపావళి పండగల సందర్భంగా బ్యాంకు నుంచి రాయితీలు ఇస్తున్నట్లు వివరించారు. 8 ప్రముఖ కార్ల కంపెనీలు ఇందులో పాల్గొంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారులు, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవి మండపాలు ముస్తాబు



దోమకొండలో ముస్తాబైన చాముండేశ్వరి ఆలయం



నర్వలో ముస్తాబైన దుర్గామాత మండపం



రాజంపేటలో..

దోమకొండ : మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయం శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయి. 3, 4, 9 తేదీల్లో అయ్యప్ప భజన మండలివారిచే భజనలు, 5, 7, 8, 10, 11 తేదీల్లో ఒగ్గు కథ, 6, 12 తేదీల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఉత్సవ కమిటి అధ్యక్షుడు పెద్దిరెడ్డి సిద్దారెడ్డి తెలిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు నార్ల వెంకటేశం, రమేష్, నిమ్మ రాజేశ్వర్ నర్రాగుల ఎల్లయ్య, ఆలయ ఈవో ప్రభు ఉన్నారు.

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో గురువారం నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతున్నాయి. దీంట్లో భాగంగా మండల కేంద్రంలో బుధవారం మండపాలను ముస్తాబు చేస్తున్నారు. యువత మాలధారణ చేసి నియమనిష్టలతో అమ్మవారిని కొలిచి ప్రత్యేక పూజలు చేస్తున్నామన్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల కోసం దుర్గామాత మండపాలను నిర్వాహకులు ముస్తా బు చేశారు. గురువారం దుర్గామాత అమ్మవార్లను మండపాల్లో ప్రతిష్ఠించి 9 రోజుల పాటు భక్తితో పూజించనున్నారు. నవరాత్రి ఉత్సవాలు, అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠాపనకు మండలి సభ్యులు తగిన ఏర్పా ట్లు చేస్తున్నారు.

రాజంపేట : నేటి నుంచి దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. రాజంపేట మండల కేంద్రంతో పాటు మండలంలోని బస్వన్నపల్లి, అర్గొండ, కొండాపూర్, తలమడ్ల గుండారం గ్రామాలలో దుర్గామాతా మండపాలను అందంగా తీర్చిదిద్దారు. దీంతో గ్రామాలలో నేటి దుర్గామాతా పూజలు, దాండియా ఆటలతో పండగ వాతావరణం నెలకొననుంది.

నిర్మాణరంగ కార్మికులు లేబర్ కార్డు పొందాలి



బాన్సువాడ రూరల్ : తాపీమేస్త్రీలు, నిర్మాణరంగ కార్మికులు తప్పనిసరిగా లేబర్ కార్డు కలిగి ఉండాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు దుబాస్ రాములు సూచించారు. బుధవారం మండలంలోని కొత్తాబాది గ్రామంలో తాపీమేస్త్రీలకు అవగాహన కల్పించారు. యూనియన్ ద్వారా లేబర్‌కార్డు చేయించుకుంటే కార్డు కలిగిన వారికి డెలివరీ, మ్యారేజ్ బెనిఫిట్స్ వర్తిస్తాయన్నారు. అలాగే ప్రమాదవశాత్తు మృతి చెందినా సహజ మరణం పొందినా, పనిప్రదేశంలో అంగవైకల్యం పొందినా కార్మికశాఖ ఆర్థికసాయం అందిస్తుందన్నారు. అనేక పోరాటాలతో వెల్ఫేర్‌బోర్డు సాధించామని, దాన్ని ప్రైవేట్‌కు అప్పగించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాయిలు, శ్రీనివాస్, నారాయణ, తదితరులు

ఢిల్లీ పోలీసులమని నమ్మించి రూ.9.29 లక్షలు కాజేత

కామారెడ్డి క్రైం: తాము ఢిల్లీ పోలీసులమని ఓ వ్యక్తిని నమ్మించిన సైబర్ నేరగాళ్లు అతడి ఖాతాలో నుంచి రూ.9.29 లక్షలు కాజేశారు. ఈ ఘటన కామారెడ్డిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పట్టణానికి చెందిన కిషన్‌రావుకు గత నెల 26న గుర్తు తెలియని ఫోన్ చేసి.. ఢిల్లీ నుంచి పోలీసు అధికారులం మాట్లాడుతున్నామని అన్నాడు. నీపై డ్రగ్స్, మనీ లాండరింగ్ కేసులు నమోదయ్యాయని, నిన్ను అరెస్ట్ చేయడానికి పోలీసులు వస్తున్నారని నమ్మించాడు. అరెస్ట్ చేయకుండా ఉండాలంటే నీ అకౌంట్‌లో ఉన్న మొత్తం డబ్బులు తాము సూచించిన ఖాతాకు పంపాలన్నాడు. కేసు పూర్తయిన తర్వాత డబ్బు తిరిగి పంపుతామని చెప్పడంతో కిషన్‌రావు నాలుగు విడుతల్లో రూ.9.29లక్షలను వారు సూచించిన అకౌంట్‌లో జమ చేశాడు. తర్వాత తాను మోసపోయినట్లు గ్రహించి పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

డ్రగ్స్ కేసులో ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఎల్లారెడ్డి: యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ కేసులో ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎల్లారెడ్డి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఈశ్వర్‌గౌడ్ ఇంట్లో మత్తు పదార్థాలు ఉన్నాయన్న సమాచారం మేరకు ఎస్సై మహేశ్ తనిఖీలు నిర్వహించగా అతడి వద్ద 5 గ్రాముల అల్ప్రాజోలం లభించిందని, ఆ తరువాత అనుమానంతో ఇంటి మొత్తాన్ని తనిఖీ చేయగా, ఓ గూటిలో 140 గ్రాముల క్లోరో హైడ్రేడ్, 280 గ్రాముల అల్ప్రాజోలం, 55 గ్రాముల గంజాయి లభించిందన్నారు. ఈశ్వర్‌గౌడ్‌ను విచారించగా.. తన వద్ద కేవలం 5 గ్రాముల అల్ప్రాజోలం మాత్రమే ఉందని, తనకు తన మామ వరుస అయిన నారాగౌడ్ అల్ప్రాజోలం సరఫరా చేస్తాడని, మిగతా వాటితో తనకు సంబంధం లేదని చెప్పాడు. అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్‌పై అనుమానం ఉందని పోలీసులకు తెలుపడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. శ్రీనివాస్‌గౌడ్ అనే వ్యక్తి తనకు రూ.15 వేలు ఇచ్చి జీపీలో పర్మినెంట్ ఉద్యోగం కల్పిస్తానని హామీ ఇవ్వడంతో శ్రీనివాస్‌గౌడ్ ఇచ్చిన ప్యాకెట్లను గత నెల 27న ఈశ్వర్‌గౌడ్ ఇంట్లో ఉంచినట్లు తెలిపాడు. దీంతో ఈశ్వర్‌గౌడ్‌తో పాటు నారాగౌడ్, లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. ప్రధాన నిందితుడు శ్రీనివాస్‌గౌడ్ పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈశ్వర్‌గౌడ్‌తో శ్రీనివాస్‌గౌడ్‌కు పాత కక్షలు ఉండడంతో దీనిని దృష్టిలో ఉంచుకుని ఈశ్వర్‌గౌడ్‌ను కేసులో ఇరికించాలని పతకం పన్నాడన్నారు. నిందితుల వద్ద నుంచి 55 గ్రాముల గంజాయి, 280 గ్రాముల అల్ప్రాజోలం, 140 గ్రాముల క్లోరోహైడ్రేడ్, రూ.10 వేల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేశ్‌ను డీఎస్పీ అభినందించారు.

నగదుతో పరారైన వారి పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

బీబీపేట: ఆసరా, చేయూత పింఛన్ డబ్బులు రూ.10 లక్షలతో పరారైన పోస్టల్ మాజీ ఉద్యోగి దేవిసోత్ బిక్యానాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోస్టాఫీస్ డబ్బులను పక్కదారి పట్టించడంతో బిక్యానాయక్ గత మూడు నెలల క్రితం సస్పెండ్ అయ్యాడు. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఇస్సానగర్, తుజాల్‌పూర్ గ్రామాలకు చెందిన ఆసరా, చేయూత పింఛన్ లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు రూ.10 లక్షలను ఇన్‌చార్జి పోస్ట్‌మాస్టర్ అనిల్ బీబీపేటకు తీసుకు వచ్చి బిక్యానాయక్ అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉంచాడు. అనిల్‌ను నమ్మించిన బిక్యానాయక్‌తోపాటు అతడి స్నేహితుడు వాకోడోత్ సురేశ్ రూ.10 లక్షలతో పరారయ్యారు. పోస్ట్‌మాస్టర్ అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను కోటగిరి మండలం సుద్దులం తండాలో పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10లక్షలు రికవరీ చేశామని, నిందితులను కోర్టులో హాజరుపరిచామని ఎస్సై తెలిపారు.